




బొమ్మల కొలువు సందర్శనలో జీఎం, యూనియన్ల ప్రతినిధులు

## బొమ్మల కొలువు సందర్శన

గోదావరిఖని, జనవరి 24: సింగరేణి ఆర్జీ-1 లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇల్లందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును సింగరేణి యూనియన్ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన క్రాఫ్ట్, ఆర్ట్ ఎగ్జిబిట్ పెయింటింగ్ భవిష్యత్ తరాలు తెలుసుకునేలా ఈ బొమ్మల కొలువు వేదికైందన్నారు. ఇక్కడ ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, తెలంగాణ మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, టీబీజీకేఎస్, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ ప్రెసిడెంట్లు మిర్యాల రాజిరెడ్డి, యాదగిరి సత్తయ్య, రియాజ్ అహ్మద్, రాజిరెడ్డి, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



నియామక పత్రాలతో ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 24 : యువ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసి సంస్థ వృద్ధిలో భాగస్వాములు కావాలని ఆర్జీ-2 జీఎం బీ వెంకటయ్య కోరారు. వివిధ విభాగాల్లో పని చేసి మెడికల్ అన్‌ఫిట్ అయిన మాజీ ఉద్యోగుల వారసులు ఏడుగురికి శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం కార్యదర్శి జీ రవిందర్, పర్సనల్ అధికారి అనిల్ కుమార్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్, డీవైపీఎం వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

### ఖని దవాఖానలో అరుదైన చికిత్స

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 24: జగిత్యాల జిల్లా వెల్గటూరుకు చెందిన రజిత(19)కు గురువారం రాత్రి గోదావరిఖని జనరల్ దవాఖానలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో వైద్యులు శ్రీదేవి, అనిల్, మౌనిక రోగికి ల్యాప్రోస్కోపీ సర్జరీ చేశారు. ఆపరేషన్ విజయవంతంతో రోగి ప్రాణాలను కాపాడారు. అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో వైద్య బృందానికి సిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ అభినందనలు తెలిపారు.

### హై స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 24 : రామగుండం-3 పరిధిలోని ఎస్ఎంఎస్ ప్లాంటులో పని చేస్తున్న కార్మికులకు హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉల్లి మొగిలి కోరారు. శుక్రవారం ఎస్ఎంఎస్ ప్లాంట్ మేనేజర్ సేల్వానంద్‌ను కలిసి వినతి పత్రంఅందజేశారు. ఆయన వెంట ఎస్ రాజన్న, భూమయ్య, లక్ష్మీనారాయణ, రామన్న ఉన్నారు.

### షీటీమ్‌పై అవగాహన

జ్యోతినగర్, జనవరి 24: ఎన్టీపీసీలోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం షీటీమ్‌పై అవగాహన కల్పించారు. షీటీమ్ ఇన్‌చార్జి, ఏఎస్ఐ మల్లన్న మహిళల భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. షీటీమ్ సభ్యులు స్నేహలత, హెచ్‌ఎం మంజుషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ఏడాదిగా తిరోగమనం వైపు..

కోల్‌సిటీ, జనవరి 24:బీఆర్ఎస్ హయాంలో నాలుగేళ్లు నిధుల వరదతో అభివృద్ధి వైపు పురోగమించిన రామగుండం బల్దియా ఏడాది కాలంగా తిరోగమం బాట పట్టింది. ఇక్కడికి కమిషనర్‌గా రావడానికి కూడా ఏ అధికారి కూడా ఇష్టపడడం లేదు. ఒక్క ఏడాదిలోనే ఇద్దరు కమిషనర్లుగా మారగా, ప్రస్తుతం ఇన్‌చార్జి కమిషనర్‌తో ఒడ్డెక్కించాల్సిన పరిస్థితి నెలకొంది. రామగుండం నగర పాలక వర్గం పదవీ కాలం ఈనెల 27న ముగియనుంది. నాలుగేళ్లు తలెత్తుకొని పని చేసిన కార్పొరేటర్లు ఏడాది కాలం నుంచి మాత్రం తల దించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏడాదిగా రామగుండంలో కూల్చివేతలు, అక్రమ నిర్మాణాలకు మళ్లీ అనుమతులు, అవినీతి ఆరోపణలు, అపవాదులు తప్పితే సాధించిన పురోగతి కనిపించడం లేదు.

**కేసీఆర్, కేటీఆర్ చొరవతో అభివృద్ధి వైపు**

రామగుండం కార్పొరేషన్‌కు పాలక వర్గం 2020 జనవరి 27న కొలువుదీరింది. కాగా, అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ హయాంలో రామగుండం బల్దియాకు ఏటా రూ.100 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నాయకత్వంలో రామగుండం కార్పొరేషన్ అభివృద్ధి వైపు పురోగమించింది. కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో రోడ్ల అభివృద్ధికి ఒక్కో డివిజన్‌కు దాదాపు రూ.14 కోట్ల వరకు నిధులు వెచ్చించారు. చందర్ చొరవతో నగరంలో ఐదు చోట్ల రూ.2.50 కోట్లతో ఐదు జంక్షన్లను నిర్మించి నగరానికి కొత్త శోభను తీసుకవచ్చారు. మిషన్ భగీరథ పైపులైన్లను అన్ని డివిజన్లకు విస్తరించి ఇంటింటికి శుద్ధ జలాలను అందించారు. సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి నగరంలో పలు చోట్ల ఆర్వో ప్లాంట్లు కూడా నిర్మించి మినరల్ వాటర్ అందజేస్తున్నారు. రీయూజ్, రెడ్యూజ్, రీ సైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను ఏర్పాటు చేసింది. నాలుగేళ్లు హిందూ శ్మశాన వాటికలో ఉచితంగా అంత్యక్రియల సేవలు అందించగా, ఏడాది కాలంగా ఆ సేవలను ఎత్తివేశారు. కార్పొరేటర్లు ప్రశ్నించలేని పరిస్థితిలో పడ్డారు. మాజీ ఎమ్మెల్యే చందర్ చొరవతో ఆఖరి మజిలీకి గౌరవంగా రామగుండం బల్దియా డీఎంఎఫ్‌టీ నుంచి దాదాపు రూ.60లక్షలు వెచ్చించి నాలుగు వైకుంఠ రథాలు అందుబాటులోకి తీసుకవచ్చింది. అంతేగాక దాదాపు రూ.4లక్షలు వెచ్చించి రెండు బాడీ ఫ్రీజర్లను తీసుకవచ్చారు. ప్రభుత్వం మారాక, బాడీ ఫ్రీజర్లను మూలకు పడేశారు. ప్రజల ఇబ్బందులను చోద్యం చూస్తూ వచ్చారు.

**రాష్ట్రంలోనే ఏకైక నగరం.**

సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో వంద మార్కులు సాధించి రాష్ట్రంలోనే ఏకైక కార్పొరేషన్‌గా రామగుండం 2023 జనవరి నెలలో ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్‌లో చోటు దక్కించుకుంది. స్మార్ట్ సిటీల సరసన రాష్ట్రంలో ఏకైక కార్పొరేషన్‌గా రామగుండం రికార్డు సొంతం చేసుకుంది.

**వీడని పాత మున్సిపల్ ఆఫీస్ స్క్రాప్ మిస్టరీ**

రామగుండం పాత మున్సిపల్ ఆఫీస్‌లో విలువైన స్క్రాప్ చోరీ ఘటనపై మిస్టరీ ఇప్పటికీ వీడలేదు. సుమారు రూ.50లక్షల విలువైన స్క్రాప్‌ను దాదాపు 2 డీసీఎం వ్యాన్‌లలో మాయం చేసిన సంఘటన అప్పట్లో దుమారం రేపింది. దీంతో అప్పటి కమిషనర్ సుమన్ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ పుటేజీలను సేకరించి కేసు నమోదు చేశారు. తర్వాత వచ్చిన కమిషనర్ కూడా స్క్రాప్ చోరీ ఘటనపై మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ, ఇప్పటివరకు ఇంటి దొంగలు ఎవరనే చేదు సంఘటన మిస్టరీగానే మిగిలిపోయింది.

**కార్పొరేటర్ల మధ్య తెగిన సత్సంబంధాలు...**

నాలుగేళ్లు కుటుంబ సభ్యుల్లా ఉన్న కార్పొరేటర్లు ఏడాది నుంచి సత్సంబంధాలు తెగిపోయాయి. ప్రభుత్వం మారాక బల్దియాలో పాలన వ్యవస్థ గాడి తప్పింది. అప్పటిదాకా బీఆర్ఎస్‌లో ఉన్న కార్పొరేటర్లు ఎవరి స్వార్థ ప్రయోజనాల కోసం వారు కాంగ్రెస్‌లోకి చేరారు. పార్టీ మారిన కార్పొరేటర్లకు ఆ పార్టీలో కూడా సరైన గుర్తింపు లేకపోవడంతో తర్వాత పొరపాటు చేసినట్లు నాలిక కరుచుకున్నారు. జంప్ జిలానీలను ఆ పార్టీ కూడా పక్కనబెట్టినట్లు తెలుస్తోంది. దీనితో ఆయా డివిజన్లలో అభివృద్ధి పనులు కుంటుపడి కార్పొరేటర్లు బయట ముఖం చూపెట్టుకోలేని పరిస్థితులను ఎదుర్కొన్నారు. అధికారులు సైతం కార్పొరేటర్లకు ఇచ్చే గౌరవం కూడా ఇవ్వడం లేదన్న అపవాదును ఎదుర్కొంటున్నారు. పార్టీలు మారిన కార్పొరేటర్లు అటు ప్రజల్లో కూడా చులకనైపోవాల్సి వచ్చింది.

**మరి ఆ సెల్‌ఫోన్ల సంగతి...?**

ఇక బల్దియా పాలక వర్గం కొలువుదీరాక 50 మంది కార్పొరేటర్లకు వన్ ప్లస్ కంపెనీకి చెందిన విలువైన సెల్‌ఫోన్లను కొనుగోలు చేసి అందజేశారు. ఒక్కో సెల్‌ఫోన్ విలువ సుమారు రూ.23వేల వరకు ఉంటుందని అంచనా. అంతకుముందు పాలక వర్గం సైతం పదవీ కాలం ముగిశాక తమ సెల్‌ఫోన్లను కార్యాలయంలో అప్పగించారు. ఐతే ఈ పాలక వర్గం సభ్యులు ఇప్పటివరకు ఆ విలువైన సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించలేదు. ఐతే, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రభుత్వంకు ఏలాంటి బాకీ ఉండొద్దనే నిబంధన ఉంది. ఈ క్రమంలో ఆ సెల్‌ఫోన్లు ఇవ్వడమా? ఇవ్వకపోయినా పర్వాలేదా అన్న మీమాంసలో పడ్డారు.

**తెరపైకి డివిజన్ల పునర్విభజన...**

ఇకపోతే ప్రస్తుతం రామగుండం బల్దియాలో డివిజన్ల పునర్విభజన తెరపైకి వచ్చింది. ఇప్పుడున్న 50 డివిజన్లను 60కి పెంచేందుకు ప్రతిపాదనలు తయారయ్యాయి. డివిజన్ల పెంపు జరిగితే రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉంది. దీనితో ఆశావాహుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడ్‌గా ఉన్న మేయర్ స్థానాన్ని జనరల్‌గా చేస్తారన్న ఊహాగానాలున్నాయి. పునర్విభజన అంశం తేలేదాకా ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యేక అధికారి పాలనతో కాలయాపన జరిగే అవకాశం ఉంది.

## ప్రశాంత వాతావరణంలో ప్రజాభిప్రాయ సేకరణ

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 24: ఈ నెల 28న ఎన్టీపీసీలో 2400మెగావాట్ల కొత్త ప్లాంటు నిర్మాణానికి సంబంధించి చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణ అన్ని శాఖల సమన్వయంతో ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం భద్రత ఏర్పాట్లపై పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ వేణు, డీసీపీ చేతన, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో శుక్రవారం రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో సీపీ మాట్లాడారు. బందోబస్తుపై ముందస్తు జాగ్రత్తలు, పబ్లిక్ ఎంట్రీ, ఎగ్జిట్ దారులు, క్యూఆర్‌టీల ఏర్పాటు, ఇతర ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇక్కడ స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, చందన్ కుమార్, సుమంత, ఎన్టీపీసీ సీజీఎం చందన్‌కుమార్ సమంత, హెచ్‌వోహెచ్ బిజోయ్‌కుమార్ సిక్దర్, ప్రవీణ్, కేవీ రావు, ఆర్డీవో గంగ య్యా, తహసీల్దార్ కుమారస్వామి, అసిస్టెంట్ రామగుండం మున్సిపల్ కమిషనర్ రాజలింగు, రామగుండం పీసీబీ ఈఈ భిక్షపతి, సీఐలు ప్రవీణ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, ఎస్ఐలు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

### అవార్డు గ్రహీతలకు సన్మానం

గోదావరిఖని, జనవరి 24: సింగరేణి రెస్క్యూ సర్వీస్‌లో 25 ఏళ్లు పూర్తి కావడంతో ఇటీవల జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో జరిగిన రెస్క్యూ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో అవార్డు అందుకున్న వారిని రెస్క్యూ స్టేషన్‌లో సన్మానించారు. అవార్డు తీసుకున్న అనంతరం శుక్రవారం మొదటిసారిగా రిఫ్రెషర్ ప్రాక్టీస్‌కు వచ్చిన ఎలిగేటి ఆనందం హెచ్‌ఎంవో, కాంతాల మల్లారెడ్డి, మాజీ బ్రిగేడ్ నెంబర్లను రెస్క్యూ స్టేషన్ సిబ్బంది సన్మానించారు.

### సమస్యలపై ఓసీపీ 5 మేనేజర్‌కు వినతి

గోదావరిఖని, జనవరి 24: ఆర్జీ-1 ఓసీపీ 5లోని సమస్యల పరిష్కారానికి సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు కచ్చకాయల సందానందం ఆధ్వర్యంలో గని మేనేజర్ అనిల్ గాబాలేకు యూనియన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉత్పత్తికి అటంకం లేకుండా నూతన యంత్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈపీ ఆపరేటర్లకు సరైన గదుల ఏర్పాటు చేయాలని, సూపర్‌వైజర్ మ్యాన్‌పవర్ పెంచాలని, క్యాంటీన్‌లో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.ఇక్కడ ఆర్జీ-1 సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి దాసు, నాయకులు గడ్డం కృష్ణ, బేబి శ్రీనివాస్, జనగామ శ్రీనివాస్, ఆంజనేయులు, పీ సమ్మయ్య, గుడేటి శ్రీనివాస్, ఎదులాపురం శ్రీనివాస్, మండ రమేశ్, వెంకట నర్సయ్య, దాసరి నర్సయ్య, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, రవీందర్‌రెడ్డి, తిరుపతి, అశోక్, సంపత్, మల్లారెడ్డి, నాగుల శంకర్, కుమార్, సిరిపురం నర్సయ్య, దూలం లక్ష్మీనారాయణ, తాళ్ళ కుమార్, కనకయ్య, తదితరులు ఉన్నారు.

### కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

గోదావరిఖని, జనవరి 24: ఆర్ఎఫ్‌సీఎల్‌లో పనిచేస్తున్న కార్మికుల వేతన, ఇతర అలవెన్స్‌లకు సంబంధించిన డిమాండ్లు పరిష్కరించాలని ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబడి నరేశ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. డిస్పాచ్‌లో పనిచేస్తున్న కార్మికుల నుంచి చౌదరి కాంట్రాక్ట్ కంపెనీ నిబంధలను విరుద్ధంగా వేతనంలో కోతలు విధిస్తున్నట్లు తెలిపారు. ఉత్పత్తి విభాగం అధికారులు సాహా, వినోద్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. యాజమాన్యం న్యాయం చేయకపోతే ఫిబ్రవరి 10న ఢిల్లీలోని ఆర్ఎఫ్‌సీఎల్, ఎఫ్ఎల్ హెడ్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు తిప్పరి రాంకీ, ముచ్చర్ల సతీశ్, ఆవుల రాకేశ్, పయ్యావుల శ్రీకాంత్, మర్రి శ్రావణ్, రావుల సురేశ్, చింతల ప్రవీణ్, వెంగళ శ్రీనివాస్, రమేశ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

### రోడ్డు భద్రతపై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 24: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం గోదావరిఖనిలో ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. రోడ్డు భద్రతా నియామాలను పాటించాలంటూ నినాదాలు చేశారు. వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. యూనిఫాం ధరించిన పలువురు ఆటో డ్రైవర్లకు విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇక్కడ ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్, సంతోష్ కుమార్, ఆర్టీవో అధికారులు ఉన్నారు.

### కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం పోరాటం

గోదావరిఖని, జనవరి 24: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పోరాటం కొనసాగుతుందని యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తోకల రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలో వివిధ విభాగాల్లో శుక్రవారం జరిగిన యూనియన్ రెండో మహాసభల్లో ఆయన మాట్లాడారు. ఇక్కడ యూనియన్ ఆర్జీ-1 అధ్యక్షుడు కొయ్యడ శంకర్ రీజియన్ నాయకులు మాట్ల సమ్మయ్య, పులిపాక రాజేందర్, ఎర్రల సారయ్య, కలువల రాయమల్లు, వాసుదేవరెడ్డి, శ్రీనివాస్, దీక్షకుమారి, రాంబాబు, మమత, లక్ష్మి, సాయి, హరి, తదితరులు ఉన్నారు.